ముక్కంటి ఈవోగా బాపిరెడ్డి బాధ్యతలు

బాధ్యతలు స్వీకరించిన శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఈవో బాపిరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి నూతన ఈవోగా టి బాపిరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మొదట బాపిరెడ్డి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పరిపాలన భవనంలో టి బాపిరెడ్డి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణా ధికారిగా బాధ్యతలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి హోం మంత్రి నివాళి

- చిన్నారి తల్లిదండ్రులకు పరామర్శ
- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ (తిరుపతి జిల్లా) : వడమాలపేట మండలం అలివేలు మంగాపురం ఎస్టీకాలనీలో హత్యాచారానికి గురైన చిన్నారి చిత్ర పటానికి హోం మంత్రి అనిత, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించి ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ. 10లక్షలు అందించారు. అనంతరం హోం మంత్రి, ఎంపి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని, వారికి సొంత ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారని, మద్యం మత్తులో నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టాడని తెలిపారు. చిన్నారిని హత్య చేసిన నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి హత్యాచారాలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అనేక హత్యాచారాలు జరిగాయని అప్పుడు రాని వారు అందరూ నేడు ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు రాజకీయ లబ్ధి కోసం పాకులాడడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని, నార్కోటిక్ వింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి సుబ్బారాయుడు, డీఎస్పీలు పాల్గొన్నారు.

మానం ఖరీదు రూ. 30 వేలు

- కీచకుడే వెలకట్టాడు.. నాయకులే బ్రోకర్లు
- బాలాయపల్లిలో ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం
- రూ.30 వేలు చెల్లించాలని తీర్పు
- తిరుపతి జిల్లాలో మరో దారుణం
- పెద్దమనుషులతో రాజీ చేయించిన నిందితుడి తండ్రి
- పరువుపోతుందని బయటకు చెప్పని బాలిక తల్లిదండ్రులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఆడబిడ్డపై జరిగిన అఘాయిత్యానికి కొంత మంది రాజకీయ నాయకులు ఖరీదు కట్టారు. అత్యాచారం జరిగితే ఖండించాల్సిన నాయకులు రాజీ చేసేందుకు వెళ్లారు. రాజకీయాల్లో తామంతా పెద్ద మనుషులుగా చెప్పుకునేవారు ఆడ బిడ్డకు న్యాయం చేయడంలో పేద మనుషులుగా ప్రవర్తించారు. పోలీస్ స్టేషన్ సాక్షిగా పంచాయితీ నడిపించారు. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు దగ్గరుండి మధ్యస్తం చేసి దారుణానికి ఖరీదు కట్టించారు.

తిరుపతి జిల్లాలో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. బాలాయపల్లి మండలం కడగుంట గ్రామంలో ఐదేళ్ల బాలికపై తొమ్మిదో తరగతి విద్యార్థి అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వడమాలపేట ఏఎం పురం ఘటన మరువక ముందే జిల్లాలో మరో బాలికపై లైంగికదాడి బయటపడింది. స్థానికుల సమాచారం మేరకు.. బాలాయపల్లి మండలం కడగుంట గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు తొమ్మిదో తరగతి చదువు తున్నాడు. వారం రోజుల క్రితం చిన్నారికి తిను బండారాలు ఆశ చూపించి అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. చిన్నారి గట్టిగా కేకలు పెట్టడంతో నానమ్మతో పాటు బంధువులు రావడంతో కామాంధుడు నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు.

కేసు నమోదు చేయని పోలీసులు

బాలికపై జరిగిన అత్యాచారంపై కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. బాలిక తల్లిదండ్రులు వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కావడంతో రాజీ చేసుకోవాలని సూచించారు. వారే పెద్ద మనుషులను, బాలుడి తండ్రిని పిలిపించి పోలీస్ స్టేషన్‌లోనే పంచాయతీ పెట్టారు. పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న ఓ సర్పంచ్, నలుగురు నాయకులు రంగంలోకి దిగారు. విషయం బయటకు రాకుండా కప్పి పుచ్చేందుకు పోలీస్ స్టేషన్‌లోనే బేరసారాలు మొదలుపెట్టారు. గంటల కొద్ది బాధితులను, నిందితులను స్టేషన్‌లో కూర్చోబెట్టి రాజీ చేశారు.

ఎట్టకేలకు బయటపడిన నిజం

దాదాపు ఒక రోజంతా స్టేషన్‌లో పెద్దమనుషులు రాజీయత్నం చేశారు. చివరకు బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయిం చారు. బాలికపై జరిగిన అత్యాచారానికి బాలుడి తండ్రి సుమారు రూ. 30 వేలు పరిహారంగా చెల్లించాలని పెద్దమనుషులు తీర్పు విషయాన్ని బయటకు రాకుండా సర్దుబాటు చేశారు. అయితే నిజం నిప్పులాంటిది. ఎక్కువ రోజులు దాగదు. వడమాల పేటలో బాలిక హత్య నేపథ్యంలో బాలాయపల్లి మండలం కడగుంట ఘటన వారం రోజులు తర్వాత బట్టబయలైంది.

బెదిరించి, భయపెట్టి..

తమ బిడ్డకు జరిగిన అన్యాయంపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అయితే అండగా నిలవాల్సిన పోలీసులు కేసు నమోదు చేయ లేదు. అప్పటికే రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. బలహీన వర్గాలకు చెందిన వారికి ఎవరు అండగా ఉంటారంటూ బాధితులను పెద్దమనుషులు బెదిరిం చారు. అంతే కాదు తాము చెప్పినంతా తీసుకుని నోరు మెదపొద్దని హుకుం జారీ చేశారు. విషయం బయటపెడితే అంతు చూస్తామని, ఎవరు అడ్డుస్తారో చూస్తామంటూ భయపెట్టారు. దీంతో బాధిత కుటుం బం సైలెంట్ అయిపోయింది.

ఖాకీల కాఠిన్యం

న్యాయం కోసం వచ్చిన బాధితులతో పోలీసులు అనుచితంగానే ప్రవర్తించారు. కేసు నమోదు చేయ కుండా నిందితుల తరుపున వకల్తా పుచ్చుకున్నారు. విషయం బయటకు రాకుండా పెద్దమనుషులను రప్పించి రాజీయత్నం చేశారు. తమ కళ్లముందే పెద్ద మనుషులు బాధితులను బెదిరిస్తుంటే అడ్డుకోకుండా చూస్తూ ఉండిపోయారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు బాధితులపైనే కేసు పెడతామంటూ బెదిరింపు లకు దిగారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో బాధితులు నష్టపరిహారం తీసుకోవడానికి అంగీకరించాల్సి వచ్చింది.

పోలీస్ శాఖకే మచ్చ

ఎస్పీ సుబ్బరాయుడు జిల్లాలో అవినీతి పోలీస్ అధికారుల భరతం పడుతున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొంత మంది పోలీసుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. తాజాగా బాలికపై అత్యాచారం కేసులోను పోలీసులు నడుచుకున్న తీరు ఆ శాఖకే మచ్చతెచ్చేలా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆటవిడుపు కోసం వస్తే ఆయుష్షు పోయింది..!

- ప్రమాదవశాత్తు విరిగిన రంగులరాట్నం
- మహిళ మృతి.. మరో మహిళలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆదివారం కావడంతో ఆటవిడుపు కోసం విహారయాత్రకు వచ్చిన రెండు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది. రంగుల రాట్నం ఆ కుటుంబాల్లో కన్నీటిని నింపింది. తిరుపతి నగరంలో లీలా మహల్ –కరకంబాడి రోడ్డు మార్గంలోని సుబ్బారెడ్డి నగరకు చెందిన లోకేశ్వరి (25) తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి తిరుచానూరు రోడ్డు లోని శిల్పారామం కి ఆటవిడుపు కోసం విహారానికి వెళ్లారు. అదే సమయంలో తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన గౌతమి(18) కొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి శిల్పారామానికి వెళ్లారు. శిల్పారామంలోని పలు కళాఖండాలను, పార్కులను, సదస్సులను తిలకించిన వారు, అక్కడే ఉన్న రంగులరాట్నం (క్రాస్ వీల్)లో తిరగాలని భావించారు. వారు వేరువేరు ప్రాంతాలు వేరువేరు కుటుంబాలకు చెందిన కనీసం పరిచయం లేని వ్యక్తులైనప్పటికీ,


జాయింట్ వీల్ ఊడి పడి మృతి చెందిన లోకేశ్వరి (ఇన్‌సెట్‌లో)

రంగులరాట్నం తిరగాలని ఆశ వారిని ఒక చోటికి చేర్చింది. లోకేశ్వరి గౌతమి ఇద్దరూ కలిసి ఒకే బాక్సులో ఎక్కారు. రంగులరాట్నం తిరుగుతూ కుటుంబ సభ్యులకు టాటా చెబుతున్న సమయంలో వారు ఎక్కిన రంగులరాట్నం బాక్స్ స్క్రూలు ప్రమాద వశాత్తు ఊడిపోవడంతో ఆ బాక్స్ దూరంగా పడింది. ఈ ఘటన లోకేశ్వరికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలతో కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్న గౌతమిని కుటుంబ సభ్యులు స్థానికుల సహకారంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్ పై చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలిం చారు. లోకేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాణ స్వీకారోత్సవ సభకు హాజరైన వైసిపి నాయకులు

కార్యకర్తలకు అండ

ప్రమాణ స్వీకారోత్సవంలో కరుణాకర్‌రెడ్డి హామీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా వుంటానని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైసిపి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షులు, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. తిరుపతి రూరల్‌లోని సదరన్‌స్పై హోటల్ ఎదురుగా చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు వేలాది మంది కార్యకర్తలు, వైసిపి అధినాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ కార్యదర్శి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలు కలిగిన భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా ఉంటూ సనాతనకు ఆ భ్యావాలను అన్వయించి, అందరికీ మంచి పనులు చేశారని గుర్తు చేశారు. ఆయన తనయుడు భూమన అభినయ్‌రెడ్డి తిరుపతిలో విశాలమైన రహదారులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారని, అయినా ఓడిపోవడం విచారకరమన్నారు. జగన్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని అందుకు తిరుపతే నిదర్శనమన్నారు. తిరుపతి ఎంపి డాక్టరు మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన భూమన అధ్యక్షతన అందరూ కలిసి కష్టపడి రాబోవు రోజుల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపు నిచ్చారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడ్డాడని, సంక్షేమం పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందించి సేవ చేశాడన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన 130 రోజుల్లోనే రాష్ట్రంలో 130 మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారం, హత్యలు జరిగాయని, పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. తిరుమల లడ్డూను రాజకీయాలకు వాడుకున్నారని విమర్శించారు. మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రసంగించారు. వైసిపి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను వైఎస్ఆర్‌తో కలిసి పోరాటాలు చేశానని, రాజారెడ్డితో శిష్యరికం చేశానని, జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఎంఎల్‌ఏగా, టిటిడి ఛైర్మన్‌గా పని చేశానని, ఆ అనుభవంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తల్లో ధైర్యం నింపి, రాబోవు ఎన్నికల యుద్ధానికి సిద్ధం చేస్తానని తెలిపారు. అనంతరం భూమన కరుణాకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీకాంత్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి మేయరు డాక్టరు శిరీషా, మాజీ ఎంఎల్‌ఏలు, సునీల్‌కుమార్, మేరుగు మురళీధర్, రాజేష్, కృపారాణి, విజయనందరెడ్డి, గత ఎన్నికల్లో ఎంఎల్‌ఏ అభ్యర్థులు, సీనియర్ నాయకులు, భూమన అభినయ్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ లేక ఆకలి

- మూత పడ్డ క్యాంటీన్
- పస్తులతో వెనుదిరుగుతున్న అర్జీదారులు
- కలెక్టరేట్‌లో ఇదీ దుస్థితి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదవారికి తక్కువ ధరకే వారి కడుపు నింపాలనే సదుద్దేశంతో అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంది. కార్యాచరణలో భాగంగా పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. ఎంతో మంచి సంకల్పంతో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లకు ఆదరణ పెరిగింది. అయితే ఇలాంటి క్యాంటీన్‌ను తిరుపతి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయలేదు. ఫలితంగా సమస్యలు విన్నవించేందుకు వచ్చే వారు ఆకలి బాధతో ఇళ్లకు వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి పేద, మధ్య తరగతి, దళితులు, గిరిజనులు వందలాది

అన్న క్యాంటీన్ లేక ఆకలితో అలమటిస్తున్న పరిష్కార వేదికకు వచ్చిన ప్రజలు

కలెక్టరేట్‌లో మూత పడిన రెస్టారెంట్

మంది తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వస్తుంటారు. ఒక్కోసారి 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు వందల సంఖ్యలో ఉండడంతో ప్రతి ఒక్కరి సమస్యను అధికారులు విని సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం పంపుతుంటారు. ఈ క్రమంలో అర్జీదారులు భోజనం కోసం పడే ఇబ్బందులను 'ప్రజాశక్తి' నేరుగా పరిశీలించింది. కలెక్టరేట్‌లో గతంలో క్యాంటీన్ ఉండేది. ప్రస్తుతం అది కూడా మూత పడింది. ఈ నేపథ్యంలో అర్జీదారులు, వారి సహాయకులు భోజనం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలో ఎలాంటి హోటళ్లు లేక పోవడంతో ఆకలితోనే వారి స్వస్థలాలకు వెనుదిరగాల్సి వస్తోంది. దీంతోపాటు కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. కలెక్టరేట్‌లో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తే తిరుపతి జిల్లా సుదూర ప్రాంతాల నుండి వచ్చే పేద, మధ్యతరగతి అర్జీదారులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం లభించే సదుపాయం వుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకుని కలెక్టరేట్‌లో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

వందల మందికి ఉపయోగం

జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా పరిధిలోని 34 మండలాలకు సంబంధించిన ఎంతో మంది పేదలు, దళితులు, గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు చేతబట్టుకుని వస్తుంటారు. ఈ క్రమంలో అర్జీలు ఇవ్వడం ఆలస్యమై ఆకలితోనే సొంత ఊర్లకు వెళ తున్నారు. వ్యయ ప్రయాసలతో వచ్చే అర్జీదారులకు జిల్లా అధికారులు అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

- వందవాసి నాగరాజు, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి.

తగిన సదుపాయాలు లేవు..

జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు తగిన సదుపాయాలను కల్పించడం లేదు. ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించే అన్నా క్యాంటీన్ల పథకాన్ని స్వాగతిస్తున్నాం. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు, అక్కడే పని చేసే చిన్న స్థాయి ఉద్యోగులకు అన్నా క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వెంటనే అధికారులు అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

- మురళి, సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి.

యథేచ్ఛగా కాలువ పోరంబోకు స్థలం కబ్జా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): యథేచ్ఛగా కాలువ పోరంబోకు స్థలాన్ని కబ్జా చేస్తున్న వైనం మంగళం పరిధిలోని న్యూ మంగళం పంచాయతీ రెవెన్యూ లెక్క దాఖలాలో చోటు చేసుకుంది. సర్వే నెంబర్ 114 లో ప్రభుత్వ భూమి, కాలువ పోరంబోకు స్థలం ఎకరాల విస్తీర్ణంలో మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి మార్గంలో పడమర దిశలో దూరంగా ఉండటంతో దీన్ని గమనించిన ఆక్రమణదారులు యథేచ్ఛగా కాంపౌండ్ వాల్‌తో పాటు గది నిర్మాణాన్ని చేపట్టారు. విలువైన స్థలం చేజారి పోతున్న రెవెన్యూ అధికారులు స్పందించలేదని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణ దారులు అధికార పార్టీ నాయ కులుగా స్థానికంగా ఉన్నారని సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విలువైన కాలువ పోరంబోకు భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కబ్జాకు గురవుతున్న కాలువ పోరంబోకు స్థలం

స్విగ్గీ బిర్యానీలో బొద్దింక

నిద్రావస్థలో ఫుడ్ సేఫ్టీ అధికారులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని హోటల్ నుండి ఆన్‌లైను ఆర్డర్ ద్వారా తెప్పించుకున్న బిరియానిలో బొద్దింక ఉండడంతో వినియోగదారుడు విస్తుపోయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు కథనం మేరకు తిరుపతి చెందిన ఓ వినియోగదారుడు బస్ స్టాండ్ సమీపంలోని స్పైసీ ప్యారడైస్ హోటల్ నుండి స్విగ్గి ఆన్‌లైను ద్వారా బకెట్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. అందుకు రూ. 1,255 చెల్లించాడు. బకెట్ బిర్యానీ ఆర్డర్ చేతికి వచ్చాక ఓపెన్ చేయగానే బిర్యానీలో బొద్దింకలు ఉండడంతో విస్తుపోయాడు. గతంలో తిరుపతిలో ఇదే ఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ఫుడ్ సేఫ్టీ అధికారులు నిద్రావస్థలో వుండడం బాధాకరమని, వినియోగ దారులు ప్రశ్నిస్తే తూతూ మంత్రంగా తనిఖీలు జరిపి, చిన్న జరిమానాలతో సరిపెడుతున్నారని అధికారులు ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, యాత్రికులు కోరుతున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధే లక్ష్యం

స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ అధికారి ఆర్ లోకనాధం

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - తిరుపతి: నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పనిచేస్తోందని ఆ సంస్థ జిల్లా అధికారి ఆర్ లోకనాథం తెలిపారు. తిరుపతి జిల్లాలోని యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన 'ప్రజాశక్తి'తో పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో ఏడు స్కిల్ సెంటర్‌లను ప్రభుత్వం నెలకొల్పిందని, దీని ద్వారా యువతకు కమ్యూనికేషన్ స్కిల్స్, సమయపాలన, ఆర్థమెటిక్, రీజనింగ్, కంప్యూటర్ డేటా ఎంట్రీ, అకౌంటెంట్, ఎగ్జిక్యూటివ్, ఎలక్ట్రానిక్స్, డ్రైవింగ్ పోస్టులకు ఉపయోగపడేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రీషన్ స్కిల్ కళాశాలలో స్వల్పకాలిక హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లలో ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, టైలరింగ్, నిర్మాణ రంగానికి సంబంధించిన కోర్సులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎస్వీ పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటిఐలోని స్కిల్‌హబ్ సెంటర్లలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో యువతీ యువకులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ కనీస అర్హతగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధే లక్ష్యంగా డిగ్రీ పూర్తి చేసిన యువత సైతం కంప్యూటర్ వినియోగం, ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లీష్, తెలుగు టైపింగ్‌లో శిక్షణతో సర్టిఫికెట్‌నూ ఇచ్చినట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ అనుబంధ, ప్రైవేటు సంస్థలు, వివిధ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నా మన్నారు. కనీసం రూ. 12 వేల నుంచి 25 వేల వరకు ప్రారంభ వేతనం అందుకుంటున్నారని పేర్కొన్నారు. నైపుణ్యం, సీనియారిటీని ఆధారంగా వేతనాలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని చెప్పారు. ఇలా తిరుపతి జిల్లాలో సుమారు 7 వేల మందికి పైగా పలు కోర్సులలో శిక్షణ తీసుకుని ఉద్యోగావ కాశాలను పొందారని తెలిపారు.

నేడు తిరుపతి, పిచ్చాటూరులో నేడు జాబ్ మేళా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి తిరుపతిలోని మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న నేషనల్ కాలేజ్ ఆఫ్ కన్స్ట్రక్షన్ కార్యాలయ ఆవరణలోనూ అలాగే పిచ్చాటూరు ఎంపీడీ ఓ కార్యాలయ ఆవరణ లోనూ జాబ్ మేళాలను నిర్వహిస్తు న్నట్లు లోకనాథం పేర్కొన్నారు. అమరరాజ, ఎస్‌బిబి మెడికేర్, శ్రీరామ్ చిట్స్, డైకిన్ ఇండియా, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్ ఇండియా కంపెనీ, సెవెన్ హిల్స్, టాటా బిగ్ బాస్కెట్ లాంటి కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నా యని, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో లేదా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 97034 37472, 94403 74535 నెంబర్లను అభ్యర్థులు సంప్రదించాలన్నారు.

తిరుపతి చేరిన రైల్వే స్టడీ టూర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రైల్వే శాఖపై ఆన్ ది స్పాట్ స్టడి టూరు నిమిత్తం తిరుపతి జిల్లాకు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం దురంతో ఎక్స్‌ప్రెస్‌లో సిఎం రమేష్ సారథ్యంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. వీరికి సౌత్ సెంట్రల్ రైల్వేస్ జీఎం అరుణ్ కుమార్ జైన్, డిఆర్ఎం విజయకుమార్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్య నారాయణ, భాను ప్రకాష్ రెడ్డి, ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నుండి బయలుదేరి రేణిగుంట రైల్వే స్టేషన్ కు తిరుపతి జిల్లా లో రైల్వే శాఖ అభివృద్ధి పనులు పరిశీలించేందుకు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సదుపాయాల కల్పనకు చేపట్టాల్సిన అంశాలపై రైల్వే అధికారులతో సోమవారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం చర్చ, రైల్వే స్టేషన్ సందర్శన ఉంటాయని, తిరుపతి జిల్లా పర్యటన అనంతరం హైదరాబాద్‌లో రైల్వే ఉన్నతా ధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. అనంతరం కమిటీ తిరుపతి తాజ్ హోటల్‌కు బయలుదేరి వెళ్లారు. ఆదివారం రాత్రి తిరుపతి తాజ్ హోటల్‌లో బస చేసి సోమవారం



ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని, అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వేస్ జీఎంతో సమావేశమై సదుపాయాల కల్పనపై చర్చించి, మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్ చేరుకుంటామని తెలిపారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై ఆన్ ది స్పాట్ విజిట్ చేసి సందర్శించి స్టేషన్ డైరెక్టర్, తదితర అధికారులతో సమీక్షించి రాత్రి 7.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి తిరిగి ప్రయాణం కానున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రైల్వే అధికారులు, తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రికార్డులు లేని వాహనాలను ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆదివా రం తనిఖీ చేశారు. మండ లంలోని తలారి వెట్టు పంచాయతీ, ఎన్టీఆర్ నగర్, కాంపాళ్యం గ్రామంలో ఎస్ఐ విశ్వనాథ నాయుడు, తన సిబ్బందితో కలిసి ఐదు గంటల నుండి గ్రామంలోని ప్రతి ఇంట్లోని రికార్డులు లేని వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దొంగ వాహనాలు అధికం కావడం ఆర్‌సి లేకపోవడం, వాహనాలు చోరీకి గురి కావడం వల్ల దొంగతనాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో, సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సరైన పత్రాలు చూపి తమ వాహనాలను తీసుకువెళ్లాలని వాహనాల యజమానులకు తెలిపారు. అంతే కాకుండా మండలంలోని ఎన్టీఆర్ నగర్ తదితర గ్రామాల్లో గంజాయి అమ్మకాలు జోరుగా జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని ఎవరైనా పట్టుబడితే వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఇది ఎస్పి సుబ్బారాయుడు ఆదేశాల మేరకు డిఎస్‌పి నరసింహమూర్తి అనుమతితో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. శ్రీ సిటీ కంపెనీలలో పని చేసేవారు ఎక్కువ మంది చోరీ వాహనాలను వాడుతున్నట్లు సమాచారం అందిందని, ఆ వాహనాలకు సరైన ఆధారాలు లేకుండా ఇతర రాష్ట్రాల నుండి మన రాష్ట్రానికి తెప్పించుకుంటున్నట్లు సమాచారం వచ్చిందని తెల్లవారు జాము అయితే ప్రతి వాహనం వివరాలు తెలుసుకోవచ్చని ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐతో పాటూ బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రభాకర్, సురేష్, గురవయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

ఉపాధ్యాయుడు రాధయ్యను సన్మానిస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గూడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాబోధన నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ సోషియల్ టీచర్ బి రాధయ్య ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక ఎంపిడి ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో బి రాధయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని స్థానిక ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మొదట ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో శైలజ మాట్లాడుతూ రాధయ్య విద్యార్థులకు అందించిన సేవలు మరువలేనివన్నారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఉన్నతమైన విద్యను అందించే మహోన్నతమైన ఉపాధ్యాయుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -కోట : టిడిపి కోట మండలం కొత్తపట్నం గ్రామ పంచాయతీలో 165వ బూత్ కన్వీనర్ దక్షాది బాబు అధ్యక్షతన టిడిపి సభ్యత్వ నమోదును ఆదివారం నిర్వ హించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, కొత్తపట్నం మాజీ ఎంపిటిసి వాటంబేటీ చెంగల్రావు, ఆ పార్టీ నాయకులు తిరుమూరు మురళి, ఇన్నమాల అనోక్,గ్రామ కాపులు మస్తానయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు బీసీ నాయకులు చల్లా సురేష్, కుమారి వెంకయ్య, అక్కయ్య గారి శ్రీనివాసులు,164 బూత్ కన్వీనర్ నెల్లిపూడి వెంకటకృష్ణ, జనసేన ఉపాధ్యక్షుడు కావలి అనోక్, ఇంగిలాల శివ, ఇంగిలాల వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి: నాగరాజు గౌడ్

మాట్లాడుతున్న నాగరాజు గౌడ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్నికల సమయం లో అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బిసిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి నగర పరిధి లోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో నాగరాజు గౌడ్ మాట్లాడుతూ బిసిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఇటీవల విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. సీఎం సైతం వినతి పట్ల సానుకూలంగా స్పందించారన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించి ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందేలా చర్యలు తీసుకోవాలని కోరమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీసీ భవన్ లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎంను కోరమన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు వసంత్ కుమార్ పాల్గొన్నారు.

భీష్మయ్య నాయుడుకి నివాళి

ప్రజాశక్తి -రామచంద్రపురం: చంద్రగిరి మండలం నారావారి పల్లి సమీపంలోని శేషాపురం గ్రామంలో గత ఆదివారం విశ్రాంత టీటీడీ హెల్త్ ఆఫీసర్, ముఖ్యమంత్రి చంద్రబాబు సమీప బంధువు డాక్టరు బొబ్బా భీష్మయ్య నాయుడు మృతి చెందాడు. ఆదివారం ఆయన సుభస్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాజీ ఎమ్మెల్యే, తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ హాజరయ్యారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బ్యాంకు శాంతమ్మ, మునిశేఖర్ రాయల్ లు సుగుణమ్మ తో పాల్గొని భీష్మయ్య నాయుడికి నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు జడ్పీ హైస్కూల్ లో 1998- 1999 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేశారు. అప్పటి జ్ఞాపకాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు గుర్తుతెచ్చుకొని ఒకరినొకరు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లా డుతూ ఇలా అందరిని కలవడం చాలా సంతోషంగా ఉందని వ్యక్తపరిచారు.

రేవంత్ రెడ్డితో సుధీర్ రెడ్డి భేటీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. శ్రీకాళహస్తిలో తెలంగాణ భవన్ ఏర్పాటుపై చర్చించారు. ఇటీవల ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తిలో పలు రాష్ట్రాల అతిధి గృహాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకాళహస్తిలో తెలంగాణ అతిధి గృహం ఏర్పాటుకు అంగీకరించారనీ, అందుకోసం దేవస్థానం పరిసర ప్రాంతంలో అర్ధ ఎకరం స్థలం కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పిన విషయం తెలిసిందే. కాగా రెండు రోజులు క్రితం తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి రాహు కేతు పూజలు చేసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డితో ను సంతరించుకుంది.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నెల్ క్యాస్ట్ పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదానికి గురై మరణించిన గోపికృష్ణ కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ను వెంటనే అందించాలని, ప్రభుత్వం నుండి రావలసిన సహాయ సహకారాలను అందించాలని సిఐటియు నాయకులు కోరారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు మాట్లాడుతూ నెల్ క్యాస్ట్ పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదానికి గురై మరణించిన గోపికృష్ణ కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియాను వెంటనే అందించాలని, ప్రభుత్వం నుండి రావలసిన సహాయ సహకారాలను వెంటనే బాధిత కుటుంబానికి అందించాలని వారు డిమాండ్ చేశారు. నెల్ క్యాస్ట్ పరిశ్రమలో దీర్ఘకారకంగా ఉన్న మిషనరి తుక్కు పట్టి పోవడం, వాటి స్థానంలో కొత్త మిషనరీ బిగించక పోవడం కార్మికుల మృతికి ప్రధాన కారణం అని వారు తెలిపారు. పరిశ్రమలలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ప్రధాన లోపం, గతంలో కూడా నెల్ క్యాస్ట్ పరిశ్రమలో పనిచేస్తున్న అనేక మంది కార్మికులకు చేతులు, కాళ్లు, ప్రమాద వశాత్తు పోగొట్టుకోవడం అంగవైకల్యంతో వీధిని పడిన కుటుంబాలు అనేకం ఉన్నాయని వారందరికీ నెల్ క్యాస్ట్ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండు చేశారు. ఇలాంటి పరిశ్రమలపై సంబంధిత అధికారులు, లేబర్ అధికారులు, నాయకులు, పట్టించుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేసిన దాఖలాలు ఇప్పటివరకు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జరుగుతున్న ప్రమాదాలపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేయించి యాజమాన్యంపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, సిఐటియు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బివి రమణయ్య, ఎస్ సురేష్, జిల్లా కమిటీ సభ్యులు పి శ్రీనివాసులు, బి చంద్రయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలోని టీపీపీఎం హైస్కూల్లో 1995-96 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా 28 సంవత్సరాల తర్వాత తాము చదివిన పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన మునిరామయ్య (మ్యాథ్స్), వెంకటేశ్వర్లు (ఇంగ్లీష్), పర్వత రెడ్డి (సోషియల్), ఉపాధ్యాయురాలు శ్రీదేవి ప్రస్తుత టిపిపిఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆనందలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి తమ ఆత్మీయ గౌరవాన్ని చాటుకున్నారు. భోజనానంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంతో ఉత్సా హంగా గడి పా రు. తమతో పాటు పదవ తరగతి చదివిన కొంత మంది మరణించిన విషయాలను తెలుసుకొని వారికి కొంత సమయం నివాళులర్పించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన తమ విద్యార్థులను చూసి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ ఆనందించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: డిఎస్‌పి

గూడూరు కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

ప్రజాశక్తి-నాయుడుపేట: నేరాలు నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అందుకు అనుగుణంగా నాయుడుపేట పోలీసులు నేర నియంత్రణ దిశగా అనేక విధాల చర్యలు చేపడుతున్నారని యువకులను మత్తుపదార్థాలకు దూరంగా ఉండే విధంగా మత్తుపదార్థాల నియంత్రణకు నాయుడుపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరులోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో డిఎస్పి చెంచు బాబు ఆధ్వర్యంలో నాయుడుపేట అర్బన్ సిఐ బాబి పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రతి వీధిలో పర్యటించి వాహనాలను తనిఖీలు చేసి, వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పొరుగు రాష్ట్రాల నుండి సుమారు 500 మంది మేనకూరు సెజ్ కంపెనీలో పనిచేస్తున్నారని వారంతా ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్ సంబంధించిన యువకులని, ఎక్కువగా మత్తు పదార్థాలకు గంజాయి లాంటి వ్యసనాలకు దగ్గరై తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్డెన్ సెర్చ్ లో గంజాయి, నెంబర్ లేని వాహనాలను తనిఖీ చేస్తామని పలు ప్రాంతాల్లో యువకులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. ఈ కంపెనీలో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు , ఏదైనా సమస్యలకు దారి తీస్తే మేనకూరు ప్రాంతవాసులు నాయుడుపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట,పెళ్లకూరు, దొరవారి సత్రం, ఓజిలి, ఎస్ఐలు, శ్రీహరి, నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్ నిర్వహి స్తున్నామని డిఎస్‌పి వెంకటరమణ కుమార్ పేర్కొన్నారు. ఎస్‌పి సుబ్బా రాయుడు ఆదేశాల మేరకు డిఎస్‌పి రమణ కుమార్ పోలీసు బలగాలతో కలిసి గూడూరు రెండో పట్టణ పరిధిలోని నివాస ప్రాంతాల్లో (కార్డెన్ సెర్చ్) ఆదివారం తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకుని రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రమణ కుమార్ మాట్లాడుతూ గూడూరు శివార్లలో నిత్యం పోలీసు నిఘా కొనసాగుతుందన్నారు. బయట వ్యక్తులు ఎవరైనా ఇక్కడ తలదాచుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవచ్చనే అనుమానంతో పోలీసు శాఖ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సీఐ లు శేఖర్ బాబు , శ్రీనివాస్ , గ్రామీణ ఎస్. ఐ మనోజ్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు రక్షణ కల్పించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : మానవ మృగాల చేతిలో బలవుతున్న చిన్నారుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. వడమాలపేటలోని ఎస్టి కాలనీలో మూడున్నరేళ్ల సాన్వికను సుశాంత్ చాక్లెట్ ఆశ చూపించి, చంపడం దారుణన్నారు. సుశాంత్ ని వెంటనే ఉరితీయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రెమిసెస్ -1 గర్ల్స్ హాస్టల్‌లో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు చిన్న మాట్లాడుతూ ఏ ప్రభుత్వం మారినా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే అత్యాచారాలు, మానభంగాలపై ఉన్న ప్రభుత్వంపై విరుచుకుపడడం తప్ప తాము పదవిలోకి వచ్చాక ఆ మాటలన్నీ ఎటు పోతాయో తెలియని పరిస్థితి అని విమర్శించారు. వీర మహిళలుగా జనసేన కార్యకర్తలకు పేరు పెట్టిన పవన్ కళ్యాణ్ మహిళలకు అండగా ఉంటానని హామీ ఇచ్చి మరవడం విడ్డూరం అన్నారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే పదుల సంఖ్యలో అత్యాచారాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నేరాలపై వెంటనే చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. సాత్విక కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా ఇలాంటి చర్యకు పాల్పడిన వాడిని ఉరితీయాలని అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వుంటాయన్నారు. ఆ సంఘం ఎస్వీయూ ప్రధాన కార్యదర్శి చంద్ర నాయక్ మాట్లాడుతూ సాన్విక కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఎస్వీ యూనివర్సిటీ లేడీ కో కన్వీనర్ శ్రావణి , వనిత, శరవరాలు, మల్లికా, వాణిశ్రీ, మౌనిక , ఇక్బల్, అనిల్ పాల్గొన్నారు.

యూటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కెవిబిపురం మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఫ్ కేవీబీపురం మండల మహా సభ ఆదివారం నిర్వహించారు. జిల్లా సహాయ అధ్యక్షులు సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. అధ్యక్షులుగా ఎర్రమల్లె పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా ఏ.హేమం భరధరరావు, గౌరవ అధ్యక్షులుగా దామోదర్ రెడ్డి, సహాధ్యక్షులుగా సత్యనారాయణ, ప్రమీల, ఆర్థిక కార్యదర్శిగా మునెయ్య, మహిళా కార్యదర్శిగా జ్యోతి ప్రియలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, యూటీఎఫ్ లక్ష్యాల కోసం నూతన కమిటీ పని చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.



పిచ్చిమొక్కలు తొలగింపు

క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ ఆట స్థలంలో పిచ్చి మొక్కలను ప్రధానోపాధ్యాయులు రమణ య్య జెసిపి సాయంతో ఆదివారం తొల గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలల కంటే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం చాలా పెద్దది అని, ఈ పాఠశాలలో ఎప్పటి నుండో అనేక రకాల క్రీడలు నిర్వహిస్తున్నారని, అయినా ప్రస్తుత వర్షాలు పడడం వల్ల ఆట స్థలం మొత్తం పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో విద్యార్థిని విద్యార్థులకు ఆడుకోవడానికి చాలా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. దీంతో ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆట స్థలంలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సహాయ కమిషనర్ పార్వతి అన్నారు. స్థానిక బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపు నిచ్చారు. పుట్టిన రోజులకి కేకులు కోయడం ఎలా చేస్తారో ఒక మొక్కను నాటడం వల్ల పర్యావరణం పరిరక్షణ కృషి చేసిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ యూత్ ఛైర్మన్ షేక్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు, ధనుష్, , జనార్ధన్ , లీడర్లు శ్రీనివాసులు, నితిన్, తనూజ్ పాల్గొన్నారు.

రైతులకు భరోసా గోద్రాజ్ రాషిన్‌బాన్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఆరోగ్యకరమైన మిరప పువ్వులకు గోద్రాజ్ రాషిన్‌బాన్ ఎంతో ఉపయోగపడుతుందని, రైతులకు భరోసా ఇస్తుందని జిఏవిఎల క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఈవో ఎన్‌కె రాజవేలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో కీలకమైన మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయమేన పరిష్కారం గోద్రాజ్ రాషిన్‌బాన్ అన్నారు. పురుగు మందులు వాడకం వల్ల భూసారాన్ని కోల్పోకుండా చూసుకోవాలి. పొలాల్లో సున్నితమైన పర్యావరణ సమతుల్యతను కూడా దెబ్బతీసుకుంది. ఈ సమస్యను గోద్రాజ్‌వారి రాషిన్‌బాన్ పరిష్కరిస్తుందని తెలిపారు. తామరపురుగు (త్రిప్స్), లెపిడోప్టెరాన్స్, పచ్చదోమ (హప్పర్స్), నల్లి (మైట్స్)తో అనేక కీటకాలను రాషిన్‌బాన్ నాశనం చేస్తుందన్నారు. పంట నాటిన 45, 75 రోజుల మధ్య రాసిన్‌బాన్ మందును ఉపయోగిస్తే రైతులకు ఎంతో మేలుచేకుతుందని, దీనిని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

హోం మంత్రికి వినుత స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హత్యాచార బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీకాళహస్తి రాజకీయ పరిస్థితులపై ఇరువురు మాట్లాడుకున్నారు. వినుత భర్త కోట చంద్రబాబు కూడా పాల్గొన్నారు.

రాష్ట్ర కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన జూజిస్తూ ఏపీ స్టేట్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలలో 12 సంవత్సరాల లోపు విద్యార్థుల పోటీలలో డి అభినాద్ తన ప్రతిభను చాటాడు. సరస్వతి, ప్రతాప్ ల కుమారుడైన డి అభినాద్ శ్రీ కోదండ రామస్వామి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో అరవ తరగతి చదువుతున్నాడు. అదే స్కూలులోని కరాటే మాస్టర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో దాదాపుగా 5 సంవత్సరాల శిక్షణ పొందుతున్నాడు. అతని నైపుణ్యాలను గుర్తించిన కోచ్ అతనిని రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేసి ఉన్నతంగా రాణించే విధంగా తర్ఫీదులు ఇచ్చాడని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అభినాద్ కు అభినందనలు తెలిపారు.

హోం మంత్రిని కలిసిన హేమంత్ రాయల్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితని శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్‌లో టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ తిరుపతిలో పటిష్టమైన భద్రత పోలీసు ఉన్నతాధికారుల సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. సాలకూలంగా స్పందించిన హోం మంత్రి తిరుపతిలో పోలీసు నిఘా వ్యవస్థతో, పోలీసుల ఆధ్వర్యంలో సమర్థవంతమైన రక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నాదెండ్లకు వీడ్కోలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి పర్యటనకు వచ్చిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కు స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆదివారం వీడ్కోలు పలికారు. కూటమి ప్రభుత్వ పాలనలో జనసేన నాయకుల భాగస్వామ్యంపై చర్చించారు.

' జై భారత్ ' మండల కమిటీ సమావేశం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడులో జై భారత్ స్వచ్ఛంద సంస్థ సామాజిక విప్లవ రణభేరి మండల కమిటీ సమావేశం ఆదివారం ఏర్పాటు చేసి నూతనంగా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్సీ పోరాట వేదిక నాయకులు మహేష్ మాట్లాడుతూ ప్రధానంగా మతసామరస్యం, కుల నిర్మూలన, స్త్రీలకు సమానత్వం, పర్యావరణ పరిరక్షణ, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయడం సంస్థ ప్రధాన ధ్యేయమని,ప్రతి ఒక్క సభ్యులు పల్లె పల్లెకు జై భారత్ ఉద్యమాన్ని వ్యాప్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదిక నాయకులను ఎన్నుకున్నారు.

ఇళ్ల మధ్యే మద్యం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో జనాలు నివసిస్తున్న ప్రాంతాల్లో, విద్యాసంస్థల సమీపంలో మద్యం షాపులను విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా కాంట్రాక్టు తీసుకున్న వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో స్థానికులు లబోదిబో మంటున్నారు. షాపుల వద్ద మద్యం తాగి, నిత్యం గొడవలు సృష్టించే మందుబాబుల వీరంగంపై భీతిల్లుతున్నారు. ముందే వాటిని అడ్డుకోవాలని స్థానికులు తిరగబడుతుండడం గమనార్హం.

తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం.. నిత్యం ఇక్కడికి లక్ష మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు ఏడు విశ్వవిద్యాలయాలు, వందల కొద్ది డిగ్రీ కళాశాలలు, ఇంటర్ కళాశాలలు, వేలాది స్కూళ్లు వున్నాయి. తిరుపతి నగరం విద్యానగరంగా కూడా వెలుగొందుతోంది. ఈ నేపథ్యంలో మద్యం షాపుల ఏర్పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వివాదాస్పదం అవుతోంది. తిరుపతి అర్బన్ పరిధిలో 32 షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నగరంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపింది. విద్యాసంస్థలు, ఆలయాలకు 100 మీటర్ల దూరం పాటిస్తే చాలని సూచించింది. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి టెండర్లు దక్కించుకుని మద్యం వ్యాపారులు నగరంలో షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మద్యం షాపులు ఏర్పాటుకు షాపులు దొరకడం కష్టంగా మారింది. ఉన్నా అద్దెలు విపరీతంగా పెంచడంతో వెతులకులాట ప్రారంభించారు. తమకు అనువుగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని షాపుల ఏర్పాటు చేశారు. కానీ నిత్యం మహిళలు, పిల్లలు తిరిగే ప్రాంతాలు, కాపురాలు ఉండే ఇళ్ల మధ్య పదుల సంఖ్యలో విద్యా సంస్థలు వున్న ప్రాంతాల్లో సైతం షాపులు ఏర్పాటు చేశారు. మద్యం షాపులు ఏర్పాటుతో తమ ప్రాంతాల్లో తరుచూ వివాదాలు జరుగుతాయని భావించిన స్థానికులు పలు చోట్ల ఆందోళనకు దిగారు. తిరుపతి డిబిఆర్ రోడ్డులోని ప్రజలు నివసించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళనకు దిగారు. తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉన్న కస్తూర్బా వెళ్లే మార్గంలో ఇళ్ల ముందే మద్యం షాపు ఏర్పాటు చేయడంతో స్థానిక మహిళలు షాపు ఏర్పాటును అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎంఆర్ పల్లి సర్కిల్ సమీపంలోని సీతమ్మనగర్ వద్ద చుట్టుపక్కల వేలాది మంది కాపురాలు ఉన్నారు. సమీపంలోని పదుల సంఖ్యలో అనేక ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు ఉన్నాయి, ఎల్‌కెజి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు నిత్యం అక్కడ సంచరిస్తుంటారు. ఆ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యువత పెద్ద ఎత్తున మహిళలతో కలిసి ఆందోళనకు చేపట్టారు. చివరకు అధికారులు స్పందించి, వారికి నచ్చచెప్పి, షాపు మార్పు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. దీనిపై స్పందించిన జిల్లా పాలనాధికారి రెండు రోజుల వ్యవధిలో షాపును అక్కడి నుంచి మార్చా లని ఆదేశించారు. చివరకు మద్యం షాపు ఆ ప్రాంతం నుంచి వేరే చోటకు నిర్వాహకులు మార్చడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నగరంలో సుమారు ఐదు చోట్ల ఇళ్లకు, పాఠశాలలకు దగ్గరగా ఉన్న మద్యం షాపులను తొలగించి, వేరే చోటుకు మార్పు చేసి, స్థానికులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికులు కోరుతున్నారు.

ఊరుకి దూరంగా షాపులు ఏర్పాటు ఏమైంది..?

తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంతో పాటు, విద్యాకేంద్రం కావడంతో అటు విద్యార్థులు, భక్తులు, స్థానికుల ఇబ్బందులు, మనోభావాలను పరిగణలోకి తీసుకుని తిరుపతి ప్రాంతానికి దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేయాలని గతంలో మహిళా, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున డిమాండు చేశాయి. దీనిపై ప్రభుత్వాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని దశాబ్దం క్రితం అధికారులు తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఆ మేరకు నిర్ణయం ఏది చేయలేదు. గత ఐదేళ్లుగా ప్రయివేట్ మద్యం షాపులు లేకపోవడం, బెల్టుషాపులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం కారణంగా పెద్దగా దీనిపై ఎవరూ స్పందించలేదు. తాజాగా ప్రయివేట్ మద్యం షాపులు ఏర్పాటుతో మళ్లీ ఈ నినాదం తెరపైకి వస్తోంది. అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకుని, అందరికి మేలు చేయాలని పలువురు ప్రజాసామ్య వాదులు కోరుతున్నారు.

స్థానికుల తిరుగుబాటు